ధ్వంసం.. మాయం

డస్ట్‌బిన్‌ల ఏర్పాటు సదుద్దేశం ఖతం!



బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తను పారవేయకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది కూకట్‌పల్లి నియోజకవర్గంలో మినీ డస్ట్‌బిన్‌లను ఏర్పాట్లు చేసింది. దీని ముఖ్య ఉద్దేశం రోడ్లపై చెత్త వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసేలా నీలి, పచ్చ రంగుల డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసింది. కాని వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో కొన్ని డబ్బాలు మాయమవగా.. మరికొన్ని ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మినీ డస్ట్‌బిన్‌ల నిర్వహణకు సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – మోతీనగర్



అల్లాపూర్, మోతీనగర్ డివిజన్లలో మినీ డస్ట్‌బిన్‌ల దుస్థితి

సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలి

కూరగాయల విభాగం శాస్త్రవేత్త కే నిరోషా



కూరగాయల తోటలో ఉద్యాన శాస్త్రవేత్తలు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: జాతీయ సేవా పథకంలో భాగంగా నాల్గోరోజు శంషాబాద్ మండల పరిధి మల్కారంలో ఉద్యాన శాస్త్రవేత్తలు, విద్యార్థులతో కలిసి పూలు, కూరగాయల పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. రైతులు పండిస్తున్న కూరగాయలు, బెండ, టమాటా, గోరు చిక్కుడు, పాలకూర, మెంతికూర, పూదీనా, కొత్తిమీర, క్యాబేజీలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, అనుసరించాల్సిన ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి కూరగాయల విభాగపు శాస్త్రవేత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ కే నిరోషా రైతులకు తగిన సూచనలు చేశారు. ప్రధానంగా కూరగాయ పంటల్లో వచ్చే నూతన వంగడాలను ఆధునిక సాంకేతిక పద్ధతులను ఎప్పటికప్పుడు రైతులు తెలుసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని పేర్కొన్నారు. సరైన యాజమాన్య పద్ధతుల ద్వారానే అధిక దిగుబడిని పొందగలరన్నారు. కీటకాల్లో కూడా మిత్ర, శత్రు కీటకాలు ఉంటాయని వాటికి అనుగుణంగా ఎరువులను తగిన మోతాదులో వాడాలని వివరించారు. ముఖ్యంగా అధిక దిగుబడి కోసం సేంద్రియ ఎరువులను విరివిగా వినియోగించాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగామ్ అధికారులు సీఎస్‌ఆర్ సంతోషిని, లావణ్య, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యూనివర్సిటీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

రక్తదాన శిబిరం

జాతీయ సేవా పథకంలో భాగంగా శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. అన్ని దానాల కంటే రక్తదానం మహా గొప్పదని ఒక యూనిట్ రక్తదానం చేయడం వలన దాదాపు ఆరుగురి ప్రాణాలను కాపాడొచ్చని తెలిపారు. 18 ఏళ్లు పైబడిన ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చని వివరించారు. ఉస్మానియా అసుపత్రి సిబ్బంది దాతల నుంచి రక్తనిధిని సేకరించారు.

మల్కాజ్‌గిరి ఎంపీ టికెట్ ఎవరికిచ్చినా గెలిపిస్తాం

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

కూకట్‌పల్లి: దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా మూడు నెలల్లో 30వేల ఉద్యోగాలు ఇచ్చి.. యువత స్థితిగతులను మార్చి... మాట తప్పని ప్రభుత్వంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరూపించారని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 3 నెలల్లో అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల, అన్ని మతాల ప్రజలను కలుపుకొని 17 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తెలంగాణలో సమసమాజ స్థాపనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులతో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో సమావేశం నిర్వహించారు.

- ఈ సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం చేసిన రూ.7లక్షల కోట్ల అప్పును, తప్పులను సరిచేస్తూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాయకులు తెలంగాణ సంపదను దోచుకుతున్నారని ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గానికి పార్టీ తరపున ఎవరికి టికెట్ ఇచ్చినా అందరం కలిసి గెలిపిస్తామన్నారు. స్థానిక నాయకులకు అండగా ఉండాల్సి ఉందన్నారు.
- తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడేలా చేసిన రేవంత్‌రెడ్డికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ సీటును గెలిపించి బహుమతిగా ఇస్తామన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున గొప్పగా పోరాట పటిమ చూపిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ కార్యకర్తలు అందరిని గుర్తించి గౌరవించాలన్నారు. ప్రభుత్వ పదవుల్లో వారికి పెద్దపీట వేయాలని బండి రమేష్ విజ్ఞప్తి చేశారు.

సీఎంను కలిసిన మోయిజ్



మూసాపేట: మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ముఖ్యమంత్రి నివాసంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షుడు మోయిజ్ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

25న అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని శ్రీసాయి అయ్యప్పస్వామి ఆలయంలో ఉత్తర నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రధాన పూజారి విష్ణుదాస్ నంబూద్రి సమక్షంలో ఈనెల 25వ తేదీన ఉదయం 5.30 గంటలకు సర్వదేవతా అభిషేకం, గణపతి పూజ, కలశపూజ, కలశాభిషేకం, అలంకార దర్శనం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 7గంటలకు పల్లకీ సేవ, పడిపూజ, హరివరాసనం వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

యాక్సిస్ బ్యాంక్ 19వ శాఖ ప్రారంభం

గచ్చిబౌలి: యాక్సిస్ బ్యాంక్ 19వ శాఖను గచ్చిబౌలిలోని శిల్పావ్యాలీ రోడ్‌లో గురువారం శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే ఎం భిక్షపతి యాదవ్ ప్రార ంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి క్లస్టర్‌లో ఓ శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ శివప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ మాధవి, శ్రీనివాస్, స్థానికులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నేడు పశుపోషణపై సదస్సు

ఏజీవర్సిటీ: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, భారత జాతీయ ఉత్పాదక మండలి ఆధ్వర్యంలో నేడు సుస్థిర పాడి పశువుల ఉత్పాదకత సమగ్ర పశుపోషణ యాజమాన్య పద్ధతి అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక విస్తరణ విభాగం అధికారి సత్యనారాయణ తెలిపారు. సుస్థిర పశు ఉత్పాదకతపై వివిధ అంశాలపై లోతైన పరిశోధన, మేధోమదనం , ఉత్పాదకత పశు సంక్షేమం అనే అంశాలపై చర్చ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

'ఎస్కీ'లో ప్రత్యేక శిక్షణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, బిగ్‌డేటా ఎనలిటిక్స్, ఏఐపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. పాండిచ్చేరి యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బ్యాంకింగ్ టెక్నాలజీతో కలిసి ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మిరాకిల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నిపుణుడు మధు వడ్లమాని, బ్లాక్ చెయిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉపాధ్యక్షుడు అశ్వఘోష్ పాల్గొని బ్యాంకింగ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ చివరి ఏడాది విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ ఎస్కీ అవగాహన ఒప్పందాలపై సంతకం చేయడం ద్వారా పరిశ్రమ, విశ్వవిద్యాలయాల మధ్య అంతరాన్ని తగ్గించడం, నైపుణ్య ఆధారిత శిక్షణపై చర్చించారు.

'రాజకీయ కుట్రలో భాగమే కవిత అరెస్టు'

పంజగుట్ట: ఎమ్మెల్సీ కవిత అరెస్టు కేవలం రాజకీయ ప్రయోజనాలు తప్ప మరేమీ లేవని, కేసీఆర్‌ను మానసికంగా ఇబ్బందులకు గురిచేసేందుకు చేసిన కుట్రలో భాగమే అని యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రయ్య ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంబీసీ కమిషన్ మాజీ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, ముప్పు భిక్షపతి మాట్లాడుతూ... ఒక మహిళ, మాజీ ముఖ్యమంత్రి కూతురు, ఎమ్మెల్సీ అని చూడకుండా ప్రధాని నరేంద్రమోదీనే ఈడీ రూపంలో వచ్చి ముందుగానే టిక్కెట్లు కూడా బుక్ చేసుకుని అన్యాయంగా అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కవిత రిమాండ్ తొలగించి విడుదల చేయాలని, ఆమెను కేవలం ఒక సాక్షిలా చూడాలని, ముద్దాయిలా చూడకూడదని డిమాండ్ చేశారు. సమావేశంలో దత్తాత్రేయ, నాగేందర్, గీత తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

లిబర్టీ: ప్రతి ఒక్కరు మానవత్వంతో ముందుకొచ్చి రక్తదానం చేయాలని.. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే అది ప్రాణదానంతో సమానమని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన రక్తాదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రధానంగా యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాన్ని కాపాడవచ్చునని తెలిపారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం

లిబర్టీ: సృజనాత్మక సాహిత్యాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇతివృత్తంగా తీసుకొని విస్తృతస్థాయిలో కవిత్వం రాయాల్సిన అవసరం ఉందని రచయితలకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని అభ్యుదయ రచయితల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజంలో అనేక సమస్యలు రుగ్మతలు, మూఢనమ్మకాలు ఉన్నాయని వాటిని వస్తువుగా తీసుకొని కవిత్వం రాసి ప్రజల్లోకి ఆలోచన చేయడం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్

ఖైరతాబాద్: ఆంగ్ల భాషా ప్రావీణ్యంపై నైపుణ్యాన్ని అంచనా వేయడం కోసం ఐఐఎంసీ కళాశాలలో ఇంగ్లిష్ ట్యాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. గురువారం ఐఐఎంసీ ఆంగ్లభాషా విభాగం, ప్లానెట్ ఫైనాన్స్ బిజినెస్ స్కూల్, ఐఎంఎస్ లెర్నింగ్ రీసోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 40 కళాశాలల నుంచి 590 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆంగ్ల భాష వ్యక్తీకరణకు సంబంధించి 100 ప్రశ్నలతో 60 నిమిషాల పాటు పరీక్ష నిర్వహించారు. ట్యాలెంట్ టెస్ట్ అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన శ్రీజ మొదటి బహుమతిగా రూ. 6 వేలు, రెండవ బహుమతిగా లక్ష్మి ఐఐఎంసీ కళాశాల రూ. 4 వేలు, సెయింట్ జార్జిస్ ఉమెన్స్ కళాశాల నుంచి గ్లోరియా కరిష్మా, ఐఐఎంసీ కళాశాల కామిక్షి కశ్వితో పాటు మరో నలుగురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇలాంటి పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలపై పట్టు సాధించడంతో పాటు వారిలోని ప్రావీణ్యాన్ని వెలికితీయవచ్చని ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు.

ఓయూలో కొత్త పార్టీ?

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి నేతలు కొత్త పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఓయూ విద్యార్థి నేతలకు కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవుల్లో మొండి చేయి చూపింది. తొలుత అసెంబ్లీ ఎన్నికలు, తరువాత పార్లమెంట్ ఎంపీ టిక్కెట్లు ఆశించి దరఖాస్తు చేసుకున్నారు. అయినా ఒక్క విద్యార్థి నేతకు కూడా ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసే అవకాశం దక్కలేదు. చివరకు నామినేటెట్ పదవుల కోసం ఎదురు చేశారు. అయినా ఇటీవల 37 నామినేటెడ్ పోస్టుల జాబితాలో ఒక్కరికి కూడా అవకాశం దక్కదలేదు. దీంతో నిరాశ చెందిన విద్యార్థి నేతలు కాంగ్రెస్ పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్నారు. పీజీలు, పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీలు చదివి రాజకీయ అవకాశాలకు నోచుకొని కొందరు విద్యార్థి నేతలు కొత్త పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు.

'ఓటుతో గుణపాఠం చెప్పాలి'



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

లిబర్టీ: ఓటు ఆయుధంతో ఓటర్లు రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు గొప్ప ఆయుధమని దళిత బహుజనులను విస్మరించిన రాష్ట్ర అభివృద్ధిని ప్రజాసంక్షేమ విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలను లోక్‌సభ ఎన్నికల్లో తిరస్కరించాలని పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బహుజనులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరించారని ఆరోపించారు. దళిత బహుజనులను చట్టసభల్లోకి పంపితే ప్రజావానిని వినిపిస్తారని దళిత బహుజనుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. కొత్త కొత్త వాగ్దానాలతో హామీలతో ప్రజలను మభ్యపెట్టి కేంద్రంలో రాష్ట్రంలో అధికారం రావాలని కాంగ్రెస్ భారత రాష్ట్ర సమితి, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయని ఆయా పార్టీలను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తిరస్కరించాలని కోరారు. నేతలు ఇటికాల గణేష్, బి.సతీష్‌కుమార్, నక్క దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు రాజ్యసభ, ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వండి

హిమాయత్‌నగర్: రాజకీయంగా,ఆర్థికంగా వెనుకబడి ఉన్న పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక రాజ్యసభ, నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు, ఆరు కార్పొరేషన్‌ల చైర్మన్‌లుగా అవకాశం కల్పించి పద్మశాలీల అభ్యున్నతి తోడ్పడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరెపల్లి రవికుమార్ మాట్లాడుతూ పద్మశాలీల చిరకాల కోరిక పద్మశాలీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసినందుకు సంఘం తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చేనేత రంగం సరైన పెట్టుబడి లేక చితికిపోతున్నందున ఆదుకోవడానికి పద్మశాలీలు జీవనోపాధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. రాష్ట్ర జనాభాలో 12 శాతం ఉన్న పద్మశాలీల ఆర్థిక పరిపుష్టి కొరకు పద్మశాలీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు నిరంతరం ప్రభుత్వం సమకూర్చాలని కోరారు. సంఘం కోశాధికారి కొండ సహదేవ్, సహాయ కార్యదర్శి చిప్ప నవీన్, సభ్యులు కుసుమ విజయ, దేవులపల్లి రాధిక, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి

హఫీజ్‌పేట్: భూగర్భ జలం పెంపునకు ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని జలమండలి జనరల్ మేనేజర్ రాజశేఖర్ సూచించారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నీటి యొక్క ప్రాముఖ్యత,నీటి వృథా,నీరుకలుషితమవకుండా ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గురువారం హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ రాజశేఖర్ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఒక నినాదంతో ఈ పండగను నిర్వహించుకుంటున్నామని ఈ సంవత్సరం శాంతి కోసం నీరు అనే నినాదంతో వెళ్తున్నామన్నారు. భూమిపై తాగేందుకు ఉపయోగపడే నీరు కేవలం 1 శాతం మాత్రమేనని, అందులో 0.86 శాతం చెరువులు, 0.02 శాతం నదులలో, మిగిలా 0.12 శాతం భూగర్భ జలాలు ఉన్నాయన్నారు. అభివృద్ధి జరగాలంటే నీటి వనరులు అవసరమని, జీవ వైవిధ్య రక్షణ, జీవం నీటితోనే సాధ్యమవుతుందన్నారు. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడిపోతుంటే పలుచోట్ల నీటిని వృథాగా నేలపాలు చేస్తున్నామన్నారు. అనంతరం ఇంకుడు గుంతలు ఏర్పాటుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ మారబోయిన సదానంద్ యాదవ్, సభ్యులు పాలం శ్రీను, వెంకటేశ్వర్లు, రఘునాథ్‌రావు, జీవీ రావు, జిల్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నేత దేవేందర్ మృతి



అల్విన్‌కాలనీ: అల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ జయశంకర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవేందర్ (లడ్డు) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేషగౌడ్ మీడియాతో మాట్లాడారు. ఉద్యమకారుడు దేవేందర్ లాంటి మంచి వ్యక్తిని కోల్పోవటం చాలా బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి దేవేందర్ పార్టీ కోసం క్రియాశీలకంగా పనిచేశారన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తు చేశారు. పార్టీ పరంగానే కాకుండా దేవేందర్ తనకు అత్యంత ఆత్మీయుడని పేర్కొన్నారు. ప్రతి రోజు తన పక్కనే ఉండే నా సోదరుడిని కోల్పోవటం బాధాకరమన్నారు. దేవేందర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు దేవుడు ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటూ నివాళులు అర్పిస్తున్నానన్నారు.

మర్యాదపూర్వక కలయిక



మంత్రి పొంగులేటిని కలిసిన సంజీవరావు

అల్విన్‌కాలనీ: రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని గురువారం సంజీవరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

గ్రాడ్యుయేషన్ డే



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి విలేజ్‌లోని బచ్‌పన్ ఏహెచ్‌పీఎస్ పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ అల్లూరి లక్ష్మి, ఇన్‌చార్జి శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



కూకట్‌పల్లి: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రంజిత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ సందర్భంగా గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ యువ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న జానారెడ్డి

అల్విన్‌కాలనీ: జేఎన్‌టీయూహెచ్ జాక్ రాష్ట్ర చైర్మన్ డా. శాడగొండ కరుణాకర్‌రెడ్డి మేనకోడలు అనుషారెడ్డి వివాహం అజిత్‌రెడ్డితో ఈనెల 17న మియాపూర్‌లోని విశ్వనాథ గార్డెన్‌లో జరిగింది. గురువారం అనుషారెడ్డి స్వగృహంలో సత్యనారాయణ స్వామి వ్రతం జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జానారెడ్డి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ వర్క్‌షాప్



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో గురువారం కృత్రిమ మేధస్సుపై అంతర్జాతీయ స్కాపింగ్ పై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య పథకం అమలు, ఆడిట్‌పై చర్చించారు. యూఎస్‌ఏ, బెల్జియంతో పాటు భారతదేశానికి చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులతో సహా జాతీయ అంతర్జాతీయ నిపుణులు పాల్గొన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్, అదనపు కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులున్నారు.

అటానమస్ అమలుపై వర్క్‌షాప్


ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని విద్యానగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అటానమస్ (స్వయంప్రతిపత్తి) అమలు పై వర్క్ షాప్ జరిగింది. గురువారం కళాశాల ఇంటర్నల్ సెల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అనిత అబ్రహాం అధ్యక్షత వహించగా ఓయూ కామర్స్ ప్రొఫెసర్, చీఫ్ పీర్వో డాక్టర్ ప్యాట్రిక్ అంటోని ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. కాలేజీ గవర్నింగ్ బాడీ, అకాడమిక్ కౌన్సిల్, బోర్డాఫ్ స్టడీస్, ఫైనాన్స్ కమిటీ, ఎగ్జామినేషన్ బ్రాంచ్ వంటి విభాగాల ఏర్పాటు గురించి వివరంగా తెలిపారు. ఈ కొత్త విభాగాలు విభాగాల విధివిధానాలను అనుసరించి ఎలా నిర్వహించాలో వివరించారు. కార్యక్రమంలో ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ బంగ్లా భారతీ, సుచిత్రసింగ్, కుమారస్వామి, నిర్మల తదితరుల పాల్గొన్నారు.

గవర్నర్‌కు సత్కారం



సనత్‌నగర్: నూతన గవర్నర్ రాధాకృష్ణన్‌ను హైదరాబాద్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యూత్ కన్వీనర్ మణిదీప్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ తరుపున చేస్తున్న కార్యక్రమాల గురించి గవర్నర్‌కు వివరించారు. అంతకముందు గవర్నర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్‌ను పట్టించుకోండి



ఓయూ స్విమ్మింగ్‌పూల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్విమ్మింగ్‌పూల్ మూసివేతకు దారి తీస్తోంది. ప్రతి ఏటా మార్చి నెల మొదటి వారంలో ప్రారంభం కావలసిన స్విమ్మింగ్‌పూల్‌కు ఇంత వరకు అతిలేదు గతిలేదు. వేసవిలో రూ.20 లక్షల ఆదాయం సమకూర్చిపెట్టే స్విమ్మింగ్‌పూల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరమ్మతులు చేపట్టలేదు. మరమ్మతు పనులు చేయడానికి, నీళ్లు నింపడానికి కనీసం రెండు నెలలు పడుతుంది. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్విమ్మింగ్‌పూల్ నిర్వహణకు అధ్యాపకులు, ఉద్యోగుల కొరత కారణంగా శాశ్వతంగా మూతపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన కాంట్రాక్టు ఉద్యోగులను ఇతర కార్యాలయాలకు బదిలీ చేయడం వలన సిబ్బంది కొరత ఏర్పడింది. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో కేవలం ముగ్గురు అధ్యాపకుల కారణంగా బోధన, పరిశోధన, క్రీడా మైదనాలు, ఇండోర్ స్టేడియం, జిమ్, స్విమ్మింగ్‌పూల్ నిర్వహణ కష్టసాధ్యమైంది.

స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని విద్యానగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కొనసాగుతున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సెంటర్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎస్.రవిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యానగర్ సెంటర్‌లో బీఏ, బీకాం కోర్సులు కొనసాగుతున్నాయని ఎలాంటి విద్యార్హతలు లేకున్న ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత మార్కులు సాధించి బీఏ, బీకాం కోర్సుల్లో చేరవచ్చు అన్నారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు నేరుగా డిగ్రీలో ప్రవేశం పొందవచ్చు అన్నా రు. ఈ సందర్భంగా అధ్యాపకులు చిన్నబాబు, అనిల్‌కుమార్, నర్సింగరావులు రవిప్రసాద్‌ను సన్మానించారు.